సాక్షి అనంతపురం

సోమవారం । 9 । జనవరి । 2023



టమాట కిలో రూ.10.50

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్టంగా రూ.10.50 పలికింది. మార్కెట్‌కు 1,050 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చాయి.



మా బిడ్డను కాపాడండయ్యా..!

వింతజబ్బుతో మంచానపడ్డ తన కుమారుడికి మెరుగైన వైద్యం చేయించి ప్రాణాలు కాపాడాలని అనంతపురానికి చెందిన ఓ తల్లి వేడుకుంటోంది. 8లో

గరిష్టం/కనిష్టం
31.9°/14.1°

జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుదలగాను నమోదయ్యాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

అనంతపురం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన, విద్యార్థుల అభ్యసనాన్ని పటిష్టం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ 'అనంత సంకల్పం' పేరిట 100 రోజుల కార్యక్రమం రూపొందించింది. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు మొత్తం 8 రౌండ్లలో రోజువారీ టైం టేబుల్‌కు అవరోధం లేకుండా ఉదయం, సాయంత్రం, సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్ అందించాలని ఇన్‌చార్జ్ డీఈఓ ఎం.వెంకటకృష్ణారెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పాఠశాలకు మూడు సెట్ల చొప్పున ప్రత్యేక స్టడీ మెటీరియల్ అందజేయనున్నారు. ఈ నెల 18లోపు విద్యార్థులకు అందించే స్టడీ మెటీరియల్‌ను ఆయా పాఠశాలలకు చేర్చాలని నిర్ణయం తీసుకున్నారు. విద్యాశాఖ తరఫున తొలిసారిగా స్టడీ మెటీరియల్ అందిస్తుండడం గమనార్హం. అనంత సంకల్పం కార్యక్రమంలో భాగం ప్రధానోపాధ్యాయులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ పూర్తిచేసినట్లు ఇన్‌చార్జ్ డీఈఓ తెలిపారు.

పసిడి తక్కువకేనంటూ బురిడీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తక్కువకే బంగారం అని చెబితే అత్యాశకు పోయిన వ్యాపారి నిలువునా మోసపోయాడు. రూ.15 లక్షలు నగదు తీసుకుని నకిలీ బంగారం అంటగట్టి అగంతకుడు పరారయ్యాడు. ఈ ఘటన అనంతపురంలో జరిగింది. వివరాలను వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి పోలీసు స్టేషన్ సమీపాన నివాసం ఉంటున్న చంద్రశేఖర్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. పది రోజుల క్రితం చంద్రశేఖర్‌కు ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. తనకు బంగారం దొరికిందని, తక్కువ ధరకు అమ్మాలనుకుంటున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆలోచనలో పడ్డ కిరాణా వ్యాపారి తనే ఆ బంగారం కొనాలనుకున్నాడు. వెంటనే ఆ అపరిచిత వ్యక్తికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. బంగారం చూసిన తర్వాత ఒప్పందం చేసుకుందామని చెప్పగా.. అపరిచితుడు అనంతపురం రమ్మన్నాడు. కదిరికే రమ్మని వ్యాపారి కోరితే.. అంత డబ్బు తీసుకెళ్లడం తనకు కష్టమవుతుందని చెప్పాడు. చేసేదిలేక శనివారం సాయంత్రం అనంతపురం చేరుకున్న చంద్రశేఖర్‌కు బంగారం ముక్క అందజేశాడు. దానిని స్వర్ణకారుని వద్ద చూపించగా నాణ్యమైనదేనని ధ్రువీకరించారు. బంగారం ముద్దకు రూ.15లక్షలు బేరం కుదిరింది. అదే రోజు రాత్రి శ్రీకంఠం సర్కిల్ వద్దనున్న ఓ లాడ్జి వద్ద డబ్బు.. బంగారం ముద్దను మార్చుకుని ఎవరికి వారు వెళ్లిపోయారు. ఆదివారం ఉదయానికి బంగారు ముద్ద రంగు మారడాన్ని వ్యాపారి గమనించి.. మరోసారి టెస్టింగ్ చేయించగా.. నకిలీ అని తేలింది. దీంతో బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కెళ్లి ఫిర్యాదు చేశాడు. బాధితుడికి ఫోన్ చేసిన వారు ఉత్తరప్రదేశ్ వారుగా పోలీసులు భావిస్తున్నారు.

'సెబ్' సీఐ సరెండర్

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: రాయదుర్గం 'సెబ్' సీఐ హిమబిందుపై వేటు పడింది. సీఐని అనంతపురం సెబ్ అడిషనల్ ఎస్పీ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలస్యంగా ఈ విషయం వెలుగు చూసింది. సెబ్ స్టేషన్ నుంచే మద్యం బాక్సులు బయటకు సరఫరా కావడం, కాసులిస్తే కేసుల్లేకుండా మాఫీ చేయడం, వీటిని వ్యతిరేకిస్తూ పలు ప్రజా సంఘాలు ఆందోళనకు దిగడం లాంటి కీలక పరిణామాలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఎస్పీ ఫక్కీరప్పతో పాటు సెబ్ ఉన్నతాధికారులు దీన్ని సీరియస్‌గా పరిగణించి సమగ్ర విచారణ చేయించారు. ఈ మేరకు సీఐ హిమబిందును అనంతపురం సెబ్ అడిషనల్ ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది.

సజావుగా గ్రూప్‌-1 ప్రిలిమ్స్

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్‌-1 ప్రిలిమ్స్ పరీక్ష సజావుగా జరిగింది. అనంతపురం నగరం, చుట్టుపక్కల 26 కేంద్రాల్లో రెండు సెషన్లుగా ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 74.75 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 9,926 మందికి గాను ఉదయం 7,406 మంది (74.6 శాతం) అభ్యర్థులు పరీక్షలు రాశారు. 2,520 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 7,375 మంది (74.29 శాతం) హాజరయ్యారు. 2,551 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ అపరంజిని, ఆర్డీఓ మధుసూదన్, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు జయశ్రీ, భారతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఎస్పీ ఫక్కీరప్ప, డీఎస్పీ మహబూబ్‌బాషా పర్యవేక్షించారు.



అనంతపురం ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



దివ్యాంగుడిని ఎత్తుకుని పరీక్ష హాలులోకి తీసుకెళ్తున్న పోలీసు



పరీక్ష హాలు ప్రాంగణంలో టిఫిన్ చేస్తున్న అభ్యర్థి



ప్రశ్నపత్రాలను తీసుకొస్తున్న సిబ్బంది

దీర్ఘాయుష్మాన్ భవ!

దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వైద్య ఖర్చులు.. జీవనానికి సరిపడా మొత్తాన్ని పెన్షన్ రూపంలో అందిస్తోంది. మంచానికి, వీల్‌చైర్లకు పరిమితమైన వారు.. సహాయకులు లేనిదే అడుగు వేయలేని వారు.. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారికి తీవ్రతను బట్టి రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు పెన్షన్ మంజూరు చేస్తోంది.

- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు జగన్ సర్కారు అండ
- రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు పెన్షన్
- జిల్లాలో 3,197 మందికి ప్రయోజనం
- ప్రతి నెలా రూ.1.68 కోట్ల దాకా వ్యయం

రాయదుర్గం: దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలో వివిధ దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారు 3,197 మంది ఉన్నారు. వీరందరికీ ప్రతి నెలా పింఛన్ కింద రూ.1,60,38,000 ప్రభుత్వం విడుదల చేస్తోంది. వలంటీర్ల ద్వారా ఒకటో తేదీనే ఠంచన్‌గా లబ్ధిదారుల చెంతకు నగదు చేరుస్తోంది.



రాయదుర్గానికి చెందిన ఈ వ్యక్తి పేరు ఎస్.సురేష్. వివిధ కారణాల వల్ల రెండు కిడ్నీలు పాడయ్యాయి. నిరుపేద కుటుంబం కావడంతో ప్రతి నెలా చికిత్స, ఇంటి అవసరాల కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నాడు. సీఎం జగన్ పుణ్యాన 2020 నుంచి డయాసిస్ పెన్షన్ కింద రూ.10వేలు అందుకుంటున్నాడు. ఈ డబ్బుతోనే వైద్య ఖర్చులు, కుటుంబ పోషణకు వినియోగించుకుంటున్నాడు.



పింఛన్ అందుకుంటున్న వ్యక్తి పేరు తిమ్మప్ప. రాయదుర్గం పట్టణం. పక్షవాతం కారణంగా నడవలేని స్థితికి చేరాడు. మందుల కోసం రూ.వేలల్లో ఖర్చు చేయాలి. దీని కోసం ఇదివరకు అప్పు చేసేవాడు. 2020 సంవత్సరం నుంచి రూ.5 వేల పింఛన్ అందుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నాడు. మా లాంటి వారంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపాడు.

ఆ సొమ్ముతో బాధితులు కుటుంబానికి భారం కాకుండా కాలం వెళ్లదీస్తున్నారు. వారి ఆయుష్షును మరికొంత కాలం పెంచుకుంటున్నారు.

రోగ నిర్ధారణ ఇలా..

మెడికల్ బోర్డులోని కమిటీ రోగ నిర్ధారణ చేశాక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. అనంతరం వ్యాధి నిర్ధారణ ఆధారంగా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. దానికి ఆధార్, రేషన్, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్ జతచేసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలి. దరఖాస్తును డైరెక్టర్ ఆఫ్ హెల్త్ విభాగానికి అప్‌లోడ్ చేస్తారు. అక్కడి నుండి సెర్ప్‌కు చేరుతుంది. పెన్షన్ మంజూరయ్యాక సంబంధిత సచివాలయానికి వివరాలు వెళ్తాయి. వలంటీర్ ద్వారా నగదును లబ్ధిదారులకు అందజేస్తారు.



జిల్లాలో మెడికల్ పెన్షన్ అందుకునే వారి వివరాలు

వ్యాధి	లబ్ధిదారులు	పెన్షన్ మొత్తం
(రూ.10 వేలు అందుకునే వారు)		
తలసీమియా	118	రూ.11,80,000
సికిల్ సెల్ వ్యాధి	8	రూ.80,000
హీమోఫీలియా	43	రూ.43,000
(రూ.5వేలు అందుకునేవారు)		
ఎలిఫెంటియాసిస్-4	19	రూ.95,000
పక్షవాతం	1,373	రూ.68,65,000
ప్రమాద బాధితులు	1,129	రూ.56,45,000
సీకేడీ సీరమ్-5 ఎమ్‌జీ	13	రూ.65,000
కిడ్నీ	10	రూ.50,000
సీకేడీ జీఎఫ్ఆర్	4	రూ.20,000
లెప్రసీ	396	రూ.19,80,000
కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి	84	రూ.4,20,000

పింఛన్‌తో ఉపశమనం

నాకు కిడ్నీలు పాడై మంచానికే పరిమితమయ్యాను. కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రతి నెలా మందులు కొనుగోలు చేసేందుకు డబ్బు లేక ఇబ్బంది పడేవాణ్ని. పరిస్థితి ఇలాగే కొనసాగితే ముందుగానే ఆరోగ్యం మరింత క్షీణిస్తుందని భయపడ్డా. ఇలాంటి సమయంలో వైఎస్సార్ పెన్షన్ కానుక కింద దీర్ఘకాలిక జబ్బుల కేటగిరీలో రూ.10వేల పింఛన్ మంజూరైంది. ఈ డబ్బుతో వైద్యం, మందులకు ఖర్చు చేస్తున్నాడు. పింఛన్‌తో ఉపశమనం లభించినట్లయ్యింది.

– దేవన్న, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

అర్హులందరికీ న్యాయం



జిల్లాలో కుష్టు, కిడ్నీ, లివర్, గుండె, నరాలు, పక్షవాతం, బోదకాలు, సికెల్‌సెల్, తలసీమియా, హీమోఫీలియా లాంటి దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారి వ్యాధి తీవ్రత ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ పెన్షన్ కానుక' కింద రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు పింఛన్ అందిస్తోంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యం. సిఫార్సులు లేకుండానే జిల్లాలో 3,197 పెన్షన్లు ప్రతి నెలా అందిస్తున్నాం.

– యుగంధర్, డీఎంహెచ్ఓ, అనంతపురం

పారదర్శకంగా పంపిణీ



జిల్లాలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ల పంపిణీ తరహాలోనే దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు కూడా లబ్ధిదారుల వేలి ముద్రల ఆధారంగానే వలంటీర్ల ద్వారా పింఛన్‌ను పారదర్శకంగా పంపిణీ చేయిస్తున్నాం. డీఎంహెచ్ కార్యాలయం నుంచి లబ్ధిదారులను గుర్తించి పంపితే.. ఫైనల్‌గా సెర్ప్ ద్వారా నగదు విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత నెలతో పోలిస్తే అన్ని రకాల పింఛన్ల సంఖ్య పెరిగింది. – నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ, పీడీ

రైతులకు ఆఖరు చాన్స్

- 13వ విడత పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి



అనంతపురం అగ్రికల్చర్: పీఎం కిసాన్ కోసం రైతులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ-కేవైసీ) చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ తెలిపారు. త్వరలో సంక్రాంతి కానుకగా 13వ విడత కింద పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాలకు జమ కానుందని పేర్కొన్నారు. ఈ మొత్తం జమ కావాలంటే ప్రతి రైతూ ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. గతేడాది అక్టోబర్‌లో 12వ విడతగా విడుదల చేసిన మొత్తానికి ఈ-కేవైసీ తప్పనసరి చేయగా... రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆ నిర్ణయాన్ని సడలించి 13వ విడతకు వాయిదా వేశారని గుర్తు చేశారు. అందులో భాగంగా పలు దఫాలుగా గడువు పొడిగిస్తూ అవకాశం కల్పించారన్నారు. ఈ-కేవైసీ లేదంటే ఇక నుంచి ఏటా మూడు విడతల్లో వస్తున్న రూ.6 వేలు పడదన్నారు. దీని ప్రభావంతో రాష్ట్రం ఇస్తున్న రూ.7,500 భరోసాకు కూడా భవిష్యత్తులో సాంకేతిక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. రైతులు ఇదే ఆఖరు అవకాశంగా భావించి ఈ నెల 15 లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. 15 తర్వాత వెబ్ పోర్టల్ క్లోజ్ అవుతుందన్నారు.

- జిల్లా వ్యాప్తంగా 3,31,226 పీఎం కిసాన్ అకౌంట్లు ఉండగా... ఇంకా 60 వేల నుంచి 70 వేల మంది రైతులు ఈ-కేవైసీ పూర్తి కాక పెండింగ్‌లో నిలిచిపోయినట్లు డీఏఓ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హత ఉన్న ప్రతి రైతూ ఆధార్, దానికి అనుసంధానమైన ఫోన్ నంబరు, అలాగే ఓటీపీ నంబరు ఆధారంగా అథెంటిఫికేషన్ చేసుకోవాలన్నారు. మీ-సేవ లేదా కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్‌సీ), ఆర్‌బీకే అసిస్టెంట్లను, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి వేలిముద్రలతో ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. లేదంటే www.pmkisan.gov.in అనే లింక్‌ను ఉపయోగించి స్వయంగా ఇంటర్‌నెట్ కలిగిన ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో కూడా ఆధార్, ఫోన్ నంబరు ద్వారా వచ్చే రెండు ఓటీపీల ద్వారా చేసుకునే అవకాశం ఉందని వివరించారు.

క్రిష్టిపాడులో కల్తీ జొన్నల తయారీ

- గుట్టుగా సాగుతున్న వ్యవహారం



పేడ రంగు కలిపి తెల్ల జొన్నల రంగు మార్చిన దృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడులో కల్తీ జొన్నల తయారీ గుట్టుగా సాగుతోంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా పచ్చ జొన్నలకు భారీ డిమాండ్ ఉండడంతో క్రిష్టిపాడు నివాసి వెంకటేష్‌తో కలసి శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన బాలు, బాలాజీ, వెంకటేష్, శ్రీనివాసులు అక్రమాలకు తెరలేపారు. తెల్ల జొన్నలకు పేడ రంగు అద్ది ఆరబెట్టిన తర్వాత ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఏడాదిగా ఈ తంతు సాగుతున్నట్లు సమాచారం.

రైతు బాంధవుడు జగనన్న

- 'జలకళ'తో బీడు భూములు సస్యశ్యామలం
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్



రైతు మంజమ్మ పొలంలో జలకళ బోరుబావి నుంచి వస్తున్న నీటిని చూపుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

కుందుర్పి: 'రైతుల కళ్లలో ఆనందం చూడాలనేది సీఎం ధ్యేయం. వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు వేసి బీడు భూములను సస్యశ్యామలం చేసి రైతు బాంధవుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు సంపాదించుకున్నారు' అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ తెలిపారు. ఆదివారం కుందుర్పి మండలం ఎర్రగుంటలో జలకళ పథకం కింద రైతులకు మోటర్ పంపులతో పాటు 16రకాల విద్యుత్ పరికరాలను రాష్ట్ర జలకళ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి, అడిషనల్ డిప్యూటీ కమిషనర్ సాగర్‌కుమార్‌తో కలసి ఉచితంగా అందజేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 17,970 మంది రైతులకు రూ.161 కోట్లతో ఉచితంగా బోర్లు తవ్వించామన్నారు. 13,197మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.198 కోట్లతో పంపుసెట్లు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతపురం జిల్లాలో 2,995 మంది రైతులకు బోరుబావులకు రూ.27 కోట్లు, పంపుసెట్లకు రూ.30కోట్లు ,కళ్యాణదుర్గం డివిజన్‌లో 434 మంది రైతులకు రూ,8.5కోట్లు ఖర్చు చేసి బోరుబావులు పంపుసెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. పథకం ద్వారా ఒక్కో రైతుకు సగటున రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు ప్రభుత్వం ఖర్చుచేస్తోందన్నారు. రైతుల జీవన ప్రమాణాలు పెరగాలన్నదే సీఎం ఆశయమని, రాష్ట్రంలోనే మొదటి సారిగా ఈ పథకం పనిముట్ల పంపిణీ ఎర్రగుంటలో జరగడం శుభపరిణామమన్నారు. రాజస్థాన్ తరహాలాంటి అనంతపురం జిల్లా ఈ పథకం ద్వారా సస్యశ్యామలంగా మారుతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చామన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి జగనన్నను మీరందరూ ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోవాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ కమలమ్మ, వైస్ ఎంపీపీ బీజప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, సర్పంచ్ విశాలాక్షి, డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీ రమేష్‌నాయక్, సర్పంచులు అతివుల్లా, మహదేవమ్మ, మారుతేశ్వరి, గంగాధర, ప్రభాకర్ పాల్గొన్నారు.

రాజకీయ అజ్ఞాని పవన్ కల్యాణ్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా ధ్వజం



తాడిపత్రి: లక్ష్యం లేకుండా జనసేన పార్టీతో రాజకీయాల్లోకి వచ్చిన అజ్ఞాని పవన్ కల్యాణ్ అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. ఆదివారం తాడిపత్రిలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబును సీఎం చేయాలనే అజెండాతోనే పవన్ కల్యాణ్ టీడీపీ పల్లకీని మోస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు సభల్లో 11 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతే నోరు మెదపని, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించే తీరిక లేని జనసేన అధ్యక్షుడు.. ఆ ఘటనలకు కారణమైన వ్యక్తిని ఇంటికెళ్లి కలవడం దురదృష్టకరమన్నారు. గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు పబ్లిసిటీ నిర్వాకం వల్ల 29 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయినప్పుడు కూడా పవన్ నోరు మెదపలేదన్నారు. 23 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను టీడీపీ సంతలో పశువులను కొన్నట్లు కొని, వారికి మంత్రి పదవులు ఇచ్చినా నోటికి ప్లాస్టర్ వేసుకుని ఉండిపోయాడన్నారు. జనసేన ముసుగులో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను మోసం చేస్తూ వెంటిలేటర్‌పై ఉన్న టీడీపీని కాపాడడమే అజెండాగా పవన్ పనిచేస్తున్నారని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజల మేలు కోసం శ్రమిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు మరోసారి పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ప్రమాదంలో గాయపడిన జేఎన్‌టీయూ విద్యార్థులు

గుత్తి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని జేఎన్‌టీయూ (ఏ)కు చెందిన విద్యార్థులు విఘ్నేష్, షాహీర్ ఆదివారం గుత్తి కోట సందర్శనకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గుత్తి శివారులోని ఎస్కేడీ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో విఘ్నేష్, షాహీర్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు గమనించి, క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఐసీడీఎస్, సీడబ్ల్యూసీ అధికారులు

అనంతపురం సెంట్రల్: కోల్‌కత్తాలోని దోజీపూర్ జిల్లాకు చెందిన పంధ్రెండేళ్ల బాలికను తల్లిదండ్రులకు ఆదివారం ఐసీడీఎస్, సీడబ్ల్యూసీ అధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి మాట్లాడుతూ.. ఇటీవల తన తల్లితో కలసి బెంగుళూరుకు వచ్చిన ప్రీతిరాయ్ పది రోజుల క్రితం తప్పిపోయింది. రెండురోజుల క్రితం అనంతపురం రైల్వే స్టేషన్‌లో తచ్చాడుతుండగా చైల్డ్ లైన్ 1098 సిబ్బంది గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచినట్లు గుర్తు చేశారు. దీంతో బాలికను బుడ్డప్పనగర్‌లోని బాలసదనంలో ఆశ్రయం కల్పించి, విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేసినట్లు గుర్తు చేశారు. దీంతో ఆదివారం బాలసదనానికి చేరుకున్న తల్లిదండ్రులకు బాలికను అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు ఓబులపతి, చైల్డ్‌లైన్ 1098 కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, బాలసదనం సూపరింటెండెంట్ సరస్వతి, సీడబ్ల్యూసీ డీఈఓ అబ్దుల్, ఐసీపీఎస్ సిబ్బంది సంధ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

టెన్నిస్ విజేత రామ్ ధీరజ్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సప్తగిరి సర్కిల్ రాయలసీమ స్థాయి అండర్–10 టెన్నిస్ టోర్నీ విజేతగా కర్నూలుకు చెందిన రామ్ ధీరజ్ నిలిచాడు. కడపకు చెందిన తేజ రన్నరప్ సాధించాడు. నగర శివారులోని ప్రైవేటు టెన్నిస్ అకాడమీల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రామ్ ధీరజ్ 4–1 స్కోరుతో తేజపై విజయం సాధించాడు. ఈ చిన్నారి గతేడాది నిర్వహించిన అండర్–10 టోర్నీలోనూ విజేతగా నిలవడం విశేషం. అలాగే అండర్–12 బాలుర విభాగంలో కళిష్ కార్తికేయ (అనంతపురం), అండర్–14 బాలికల విభాగంలో గీతిక జోషిప్రియ రెడ్డి (అనంతపురం) విజేతలుగా నిలిచారు.

మా బిడ్డను కాపాడండయ్యా!

కొడుకు పుడితే వృద్ధాప్యంలో అండగా ఉంటాడని ఎవరైనా అనుకుంటారు. కానీ పుట్టిన కొడుకు కొన్నేళ్లకే భరించరాని వేదనతో ఉంటే ఆ తల్లి వేదన వర్ణనాతీతం. గొప్ప చదువులు అభ్యసించి వృద్ధాప్యంలో తమకు తోడుగా ఉంటాడని ఆశించిన ఆ తల్లిని విధి వెక్కిరించింది. దిన దిన గండం నూరేళ్ల ఆయుష్షుగా మారుతున్న కొడుకు దీనస్థితిని చూసి తల్లడిల్లిపోతోంది. ఖరీదైన చికిత్సకు ఇప్పటికే ఉన్న ఆస్తినంతా పాగొట్టుకుంది. చివరకు చేతిలో చిల్లిగవ్వ లేక కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని మానవతావాదులను వేడుకుంటోంది.

– అనంతపురం కల్చరల్



నియాజ్‌కు సపర్యలు చేస్తున్న తల్లి జమీలా

- పాంక్రియాటైటిస్‌తో బాధపడుతున్న యువకుడు
- పేదరికం కారణంగా ఖరీదైన వైద్యానికి దూరం
- ఆపన్న హస్తం కోసం ఎదురు చూపు

దాతలు సంప్రదించాల్సిన చిరునామా

పేరు	: దూదేకుల నియాజ్
బ్యాంక్	: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఖాతా నంబర్	: 6246 792 6948
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్	: ఎస్‌బీఐ 0020575
మొబైల్ నంబర్	: 96183 18963

అనంతపురంలోని ఖాజానగర్‌కు చెందిన దూదేకుల బాబు, జమీలా దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నియాజ్‌కు ప్రస్తుతం 22 ఏళ్లు. తన ఎనిమిదవ ఏట నియాజ్ విపరీతమైన కడుపు నొప్పితో విలవిల్లాడాడు. ఆ సమయంలో తమకు తెలిసిన ప్రతి చోటా తీసుకెళ్లి తల్లిదండ్రులు వైద్యం చేయించారు. తల్లిదండ్రుల కష్టం చూసిన నియాజ్... ఎలాగైనా తాను ఉన్నత చదువులు అభ్యసించి, వారికి చేదోడుగా ఉండాలని భావించాడు. ఇందులో భాగంగానే నొప్పిని భరిస్తూ పదో తరగతి పూర్తి చేశాడు. ఇంటర్ చదువుతున్న సమయంలో మరోసారి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని నిజామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం పాంక్రియాటైటిస్‌తో బాధపడుతున్నట్లుగా వైద్యులు నిర్ధారించారు. కొన్నాళ్లు అక్కడే ఉంచుకుని వైద్యం చేసి తాత్కాలిక ఉపశమనం కల్గించి, వెనక్కు పంపారు. కొన్ని నెలలకు మళ్లీ కడుపునొప్పి మొదలు కావడంతో కర్నూలులోని సర్వజనాస్పత్రితో చికిత్స చేయించారు. ఏ ఆస్పత్రికి వెళ్లినా.. శస్త్రచికిత్సతో పాంక్రియాటైటిస్ లొంగదని, కేవలం మందులతోనే ఉపశమనం పొందాల్సి ఉంటుందని వైద్యులు చెబుతూ వచ్చారు. మందులు ఆపేస్తే ప్రాణానికే ప్రమాదమని హెచ్చరించారు. అప్పటి నుంచి మందులతోనే కాలం నెట్టుకొచ్చారు. ఖరీదైన మందుల కొనుగోలుకు ఉన్న ఆస్తి మొత్తం కర్పూరంలా కరిగిపోయింది. ప్రస్తుతం జీవనాధారం కోసం గౌరి థియేటర్‌కు వెళ్లేదారిలో జమీలా దోసెలు పోస్తోంది. ఈ వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయంలో ఎక్కువ భాగం కుమారుడి మందుల కొనుగోలుకే సరిపోతోంది. ఈ క్రమంలోనే రోజురోజుకూ కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతూ వచ్చింది. దీంతో కుమారుడికి అవసరమైన మందుల కొనుగోలు భారమై ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తోంది.

ప్రాణభిక్ష పెట్టండి

అయ్యా! కొడుకును చూస్తూ బతకడం మాకే కష్టంగా ఉంది. ఇక కడుపునొప్పిని భరిస్తూ నియాజ్ ఎట్లుంటున్నాడో తలచుకుంటే కన్నీళ్లు ఆగడం లేదు. ఈ పరిస్థితుల్లోనూ అమ్మా నేను చదువుకుంటానంటుంటే కాదనలేకపోయా. ఓపెన్ డిగ్రీ కట్టించాను. విదేశాల్లో తప్ప సరైన వైద్యం ఇక్కడ అందుబాటులో లేదని పెద్ద డాక్టర్లే చెప్పేశారు. ప్రాణాలతో ఉండాలంటే ఖరీదైన మందులు వాడాలి. ఇందుకు నెలకు రూ.12 వేలు అవసరమవుతాయి. మా పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటోంది. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి సాయం అర్థించాలనుకుంటున్నాం. అంత వరకూ మా కుమారుడికి ప్రాణభిక్ష పెట్టండి.

– జమీలా, నియాజ్ తల్లి, అనంతపురం

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సంఘీభావం ప్రకటిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, నదీం అహమ్మద్ తదితరులు



సమావేశానికి హాజరైన మైనార్టీలు

- ఆత్మీయ సభలో మాజీ ఎమ్మెల్యే విశ్వ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం

ఉరవకొండ: మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్ స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఉరవకొండ పాత మార్కెట్ వద్ద కో–ఆప్షన్ సభ్యుడు పామిడి సలీం అధ్యక్షతన ముస్లింల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడిగా ఎన్నికైన జీఎంఎస్ మీరంబాషాను సన్మానించారు. కార్యక్రమానికి విశ్వతో పాటు నదీం అహమ్మద్ ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. మైనార్టీ అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. ఉరవకొండలో దాదాపు 1,100 మంది ముస్లింలకు ఇంటిపట్టాలు అందించడంతో పాటు వారికి పక్కా గృహాలు నిర్మించిఇచ్చినట్లు గుర్తు చేశారు. రూ.28 లక్షలతో ఉర్దూ పాఠశాలల అభివృద్ధి, వైఎస్సార్ ఆసరా పథకం కింద 500 మైనార్టీ మహిళా సంఘాలకు లబ్ధి చేకూరిందన్నారు. ఈద్గా, కబరస్తాన్ ప్రహరీ నిర్మాణాలకు రూ.28లక్షల కేటాయించినట్లు తెలిపారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 5,600 ఎకరాల వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు అహమ్మద్, కార్యదర్శి ఖాజా, ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, పార్టీ మైనార్టీ కన్వీనర్ పామిడి జాకీర్, నాయకులు ప్రణయ్ రెడ్డి, అన్వర్, అయ్యర్‌దాదు, శర్మాస్, వడ్ల సలీం, జీఎంఎస్ షాకీర్, జిలాన్, వన్నూర్‌సాహెబ్, ఆసీఫ్, పామిడి నిజాం, తాజు, రఫీ, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పోలీసునంటూ నగదు అపహరణ

యాడికి: పోలీసునంటూ నగదు దోచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... యాడికికి చెందిన వెంకట్రాముడు శుక్రవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై రాయలచెరువు నుంచి యాడికికి వస్తుండగా మోడల్‌స్కూల్‌కు వెళ్లే లింకు దారి వద్ద సివిల్ దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి అడ్డుకున్నాడు. తాను కానిస్టేబుల్‌నని, ఇటీవల ద్విచక్రవాహనాల్లో గుట్కా రవాణా జరుగుతున్నట్లుగా సమాచారం ఉండడంతో వాహన తనిఖీలు చేస్తున్నట్లు తెలిపాడు. ద్విచక్ర వాహనం తాళం తీసుకున్నాడు. అనంతరం వెంకట్రాముడు జేబులో చెయ్యి పెట్టి రూ.16,500 నగదు తీసుకుని ఈ మొత్తానికి లెక్క చెప్పాలని డిమాండ్ చేశాడు. ఎంత నచ్చచెప్పినా వినకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరణ ఇచ్చి నగదు తీసుకెళ్లమంటూ వెళ్లిపోయాడు. ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరం ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చొరవ




సమావేశంలో పాల్గొన్న ముస్లిం ప్రముఖులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చొరవ చూపుతామని ఐక్య ముతవల్లి, మసీదు కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాయలసీమ స్థాయి మసీదు ముతవల్లి, మసీదు కమిటీ సభ్యుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముతవల్లిలు, ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు ఆస్తుల రక్షణ దిశగా ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమానికి తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. అన్యాక్రాంతమైన ఆస్తుల స్వాధీనానికి సత్వర చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ముస్లింల అభ్యున్నతికి వక్ఫ్ బోర్డు ఆస్తులే కీలకమన్నారు. కార్యక్రమంలో షఫీవుల్లా, షకీల్‌షఫి, పెనుగొండ దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా, కదిరి పీఠాధిపతి ఉబేదుల్లా హుస్సేని, కణేకల్లు ముర్షద్‌పీర్ ఖాద్రి, కడప అర్షద్ సాహెబ్, నంద్యాల హారూన్‌బాషా సాహెబ్, కర్నూలు దాదా బాషా, ప్రభుత్వ ఖ్వాజీలు హారూన్ రషీద్, చాందిని మసీదు మునీర్‌బాషా, రఫి, గుత్తి షఫి తదితరులు పాల్గొన్నారు.


బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఎంపిక




శివమూర్తి



కృష్ణప్ప



ఆంజనేయులు



లక్ష్మన్న

అనంతపురం: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల బీసీ ఉపాధ్యాయ సంఘం కమిటీలను ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.బీరప్ప, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం జరిగిన బీసీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశంలో ఈ ఎంపిక జరిగిందన్నారు. సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా పీపీ శివమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సి.కృష్ణప్ప, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా ఎం.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కె.లక్ష్మన్న ఎంపికయ్యారు.

రూ.555 కోట్లతో వాటర్‌షెడ్ పనులు

- వాటర్‌షెడ్ ప్రాజెక్టుల డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న శశిధర్‌రెడ్డి, అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా రూ.555.63 కోట్లతో 59 వాటర్‌షెడ్ పనులు చేపట్టినట్లు వాటర్‌షెడ్ ప్రాజెక్టుల డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ – ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన కింద చేపట్టిన పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటింటికెళ్లి చేపట్టాల్సిన పనులను గుర్తించిన అనంతరం డీపీఆర్ సిద్ధం చేసి, పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రెండు శాతం నిధులను గ్రామ ప్రజలకు అవసరమైన పనులకు కేటాయించడం జరుగుతుందన్నారు. రైతులు, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే పనుల నాణ్యతలో రాజీ పడబోమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టే పనులకు కాంట్రిబ్యూషన్ కట్టాల్సిన అవసరం ఉండదని, ఇతర పనులకు కాంట్రిబ్యూషన్ ఉంటుందన్నారు. చేపట్టే పనులకు బిల్లులు పెండింగ్ ఉంచే ప్రసక్తే లేదన్నారు. ఇందు కోసం ఇప్పటికే రూ.75కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సాగర్‌కుమార్‌రెడ్డి, ఏపీడీ సుధాకరరెడ్డి, పీఓ శ్రీవిద్య, ఇంజనీర్ శ్రీరాములు, టీఓలు వీరన్న, శేషు, వాటర్‌షెడ్ చైర్మన్ కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు మహదేవరెడ్డి, మంజునాథరెడ్డి, రాజారెడ్డి, హనుమంతరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పాతూరప్ప, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్



నుజ్జునుజ్జైన ఆటో

రాయదుర్గం రూరల్: ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని కొప్పల్ జిల్లా గంగావతికి చెందిన ఓ కుటుంబం సొంత ఆటోలో గ్రామగ్రామాలు తిరుగుతూ కొలిమి పనులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో కళ్యాణదుర్గం నుంచి రాయదుర్గానికి ఆదివారం ఆటోలో వస్తుండగా రాయదుర్గం మండలం కదరంపల్లి టోల్‌గేట్ వద్ద కర్ణాటకలోని మొలకాల్మూరు నుంచి కళ్యాణదుర్గం వైపు ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ఆటో ముందు భాగం పూర్తిగా దెబ్బతిని, గంగావతికి చెందిన హనుమంతప్ప, శాంతి , ఈషు, నాగరత్న, వీరేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్యం కోసం వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుల్లో హనుమంతప్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఖాతాదారుల సొమ్ము స్వాహా

- వెలుగులోకి బీపీఎం అక్రమాలు



గొటుకూరులోని పోస్టాఫీస్

కూడేరు: ఖాతాదారులు పొదుపు చేసుకున్న సొమ్మును వారికి తెలియకుండానే బ్రాంచ్ పోస్టు మాస్టార్ స్వాహా చేశాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. వివరాలు.. కూడేరు మండలం గొటుకూరు బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్న పవన్‌కుమార్.. నిరక్షరాస్యులు, వృద్ధుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి ఖాతాల్లో నుంచి రూ. లక్షల్లో సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఖాతాదారులు చెల్లించిన నగదును రిజిస్టర్‌లో నమోదు చేయకుండా మోసం చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఇటీవల ఖాతాదారు పురుషోత్తం రెడ్డి తన ఖాతాలో ఎంత మేర డబ్బు ఉందనే విషయాన్ని ఆరా తీయడంతో రూ.80 ఉన్నట్లుగా పోస్టుమాస్టర్ తెలిపాడు. అయితే తన వద్ద ఉన్న పాసు పుస్తకంలో రూ.1.75 లక్షలు ఉన్నట్లుగా తెలుస్తోందని నిలదీయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో బీపీఎం పవన్‌కుమార్ కాళ్లబేరానికి వచ్చి స్వాహా చేసిన సొమ్మును త్వరలో వెనక్కు చెల్లిస్తానని నమ్మబలికాడు. దీంతో మిగిలిన ఖాతాదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే మరో ఖాతాదారు పెద్దక్క మూడేళ్లుగా తాను రూ.1.5లక్షలు పొదుపు చేసుకున్నానని, అయితే ఇందుకు సంబంధించి తన పాసుబుక్కును బీపీఎం ఇవ్వకుండా వేధిస్తున్నాడని, ఖాతాలో ఎంత మేర సొమ్ము ఉందనే విషయాన్ని సైతం చెప్పడం లేదని వాపోయింది. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

దేవర పోతుపై వీడని ఉత్కంఠ

ఉండేది ఒకేఒక్క దేవర దున్నపోతు.. రోజుల వ్యవధిలో రెండు గ్రామాల్లో దేవర (జాతర) ఉంది. దేవరపోతు లేకుంటే జాతరే జరగదు. ఊరి దేవర చేయకపోతే గ్రామానికి అరిష్టమని అందరూ భావిస్తున్నారు. దీంతో ఉన్న ఒక్క దేవరపోతును వదులుకునేందుకు రెండు గ్రామాల ప్రజలు ఇష్టపడడం లేదు. దీంతో ఆ దున్నపోతు తమదంటే.. తమదంటూ గ్రామస్తుల మధ్య వివాదం నెలకొంది. ఈ అంశాన్ని రెండు గ్రామాల పెద్దలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఉత్కంఠ నెలకొంది. – కణేకల్లు:

- మాదంటే... మాదంటున్న రచ్చుమర్రి, అంబాపురం గ్రామస్తులు
- అంబాపురంలో ఈ నెల 17న జాతర
- రెండు నెలల్లోపు రచ్చుమర్రిలో దేవర
- వదులుకునేందుకు సిద్ధంగా లేని ఇరుగ్రామాల ప్రజలు



అంబాపురం వద్ద ఉన్న దేవరపోతు

కణేకల్లు మండలానికి పడమట అంబాపురం, ఉత్తరాన రచ్చుమర్రి గ్రామాలున్నాయి. పదేళ్లకోసారి ఊరి దేవర జరపడం ఈ రెండు గ్రామాల్లో ఆనవాయితీగా వస్తోంది. ఊరి దేవర జరిగిన నెల తర్వాత అమ్మవారి పేరున ఓ మూడు నెలల వయసున్న దున్నపోతును కొనుగోలు చేసి వదులుతుంటారు. ఈ క్రమంలో పదేళ్ల క్రితం ఈ రెండు గ్రామాల్లోనూ ఊరి దేవర ముగిసిన తర్వాత మళ్లీ దున్నపోతును అమ్మవారి పేరున వదిలేశారు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాల్లో ఊరి దేవరకు గ్రామస్తులు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.

పట్టుదలకు పోయిన గ్రామ పెద్దలు..

ఈ నెల 17న అంబాపురంలో, మరో రెండు నెల ల్లోపు రచ్చుమర్రిలో ఊరి దేవర నిర్వహించాలని గ్రామ పెద్దలు నిశ్చయించారు. ఈ క్రమంలో తాము అమ్మవారి పేరుతో వదిలిన దేవర దున్నపోతు కోసం అంబాపురం గ్రామస్తులు నెల రోజులుగా వివిధ ప్రాంతాల్లో గాలించి, చివరకు బొమ్మనహాళ్ మండలం కొలగానహళ్లిలో కనిపించిన దున్నపోతును తీసుకెళ్లి గ్రామంలోని బందులదొడ్డిలో బంధించారు. విషయం తెలుసుకున్న ఉద్దేహాళ్ గ్రామస్తులు అంబాపురానికి చేరుకుని బందులదొడ్డిలో ఉంచిన దున్నపోతును గమనించి, అది తమదని వాదనకు దిగారు. అయితే ఆ పోతు తమదేనంటూ అంబాపురం వాసులు నచ్చచెప్పడంతో వారు వెనుదిరిగారు. ఈ సమస్య సద్దుమణిగిందనుకుంటున్న తరుణంలో రచ్చుమర్రి గ్రామస్తులొచ్చి పోతు తమదేనంటూ భీష్మించారు. తాము వదిలిన దున్నపోతును ఎలా బంధిస్తారంటూ అంబాపురం గ్రామ పెద్దలను నిలదీశారు. వారం రోజులుగా ఇరు గ్రామాల మధ్య ఈ వివాదం చెలరేగుతూ వస్తోంది. ఇరు గ్రామాల పెద్దలు పట్టుదలకు పోయి విశ్వ ప్రయత్నాలు చేస్తుండడంతో పలు మార్లు పంచాయితీలూ జరిగాయి. ఎవరూ రాజీ పడలేదు. ఊరి దేవరకు తేదీ నిశ్చయించుకున్నామని, ఊరంతా సంబరాలకు సిద్ధమైన తరుణంలో ఇలా ఘర్షనకు దిగడం సరికాదంటూ అంబాపురం వాసులు అంటున్నారు. అయితే ఈ పోతును వదులుకుంటే రెండు నెలల్లోపు తమ గ్రామంలో ఊరి దేవర ఎలా జరుపుకోవాలంటూ రచ్చుమర్రి వాసులు నిలదీస్తున్నారు. దీంతో పోతును వదులుకునేందుకు ఇరు గ్రామస్తులూ సిద్ధంగా లేకపోవడంతో వివాదం మరింత ముదిరింది.

స్టేషన్‌కు చేరినా తెగని పంచాయితీ..

చివరకు దేవర పోతు సమస్య కణేకల్లు పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. రెండు గ్రామాల పెద్దల మధ్య సఖ్యత కుదిర్చేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఆ పోతు తమదంటే తమదంటూ స్టేషన్‌లోనే రెండు గ్రామాల ప్రజలు మొండిగా వాదనకు దిగారు. దీంతో ఎవరికీ సర్ది చెప్పలేక పోలీసు అధికారులు తలలు పట్టుకున్నారు. పోతు కోసం తాము ఎందాకైనా పోతామంటూ ఒకరిపై మరొకరు సవాల్ విసురుకుంటున్నారు. ఈ క్రమంలో అంబాపురంలో రేయింబవళ్లు దున్నపోతుకు యువకులు పహారా కాస్తున్నారు. గ్రామంలో కొత్త వ్యక్తుల కదలికలపై పటిష్ట నిఘా వేశారు.

'బెస్తలకు రాజకీయ ప్రాధాన్యతివ్వాలి'

అనంతపురం టవర్‌క్లాక్: తరతరాలుగా వెనుకబాటుకు గురవుతున్న బెస్తలకు రాజకీయ ప్రాధాన్యతనివ్వాలంటూ అన్ని రాజకీయ పార్టీలకు బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ విన్నవించారు. ఆదివారం స్థానిక గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన బెస్త సేవాసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి బెస్తలు చైతన్యం కావాలని, ఐక్యతతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని అన్నారు. బెస్తల అభ్యున్నతికి సహకరించే పార్టీలకే మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనార్దన్, నాగరాజు, చేపల హరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామిని ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం, ఆకుపూజ, మహానైవేద్యం, పల్లకీసేవ నిర్వహించారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతిదేవికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో రాహుకేతు హోమాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

షిర్డీసాయి మందిరం క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: నగరంలోని షిర్డీసాయి బాబా మందిర క్యాలెండర్‌ను స్థానిక వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జయచంద్రచౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. కేవలం సాయి మందిరం ఆధ్యాత్మిక సేవలకు పరిమితం కాకుండా విస్తృత సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వ సూచనలు, నిబంధనలు పాటిస్తూనే భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, వెంకటస్వామి, నాగానందం, రాఘవేంద్రగుప్తా, రవీంద్రనాథ్, రవి ప్రకాష్, వెంకటనారాయణ, సామాజిక సేవా కార్యకర్త ఆశ్రయ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

11న మాదిగల జాతీయ మహాసభ

అనంతపురం టవర్‌క్లాక్: ఈ నెల 11న బెంగళూరులోని వసంతనగర్ అంబేడ్కర్ భవనంలో మాదిగల జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు తిరుపాలు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తిరుపాలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టింబర్ డిపోలో అగ్నిప్రమాదం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వేణుగోపాల్ నగర్‌లోని మహబూబ్‌బాషా టింబర్ డిపోలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న కలపకు నిప్పంటుకుంది. అగ్నిమాపక సిబ్బందికి వచ్చేలోపు టింబర్ డిపోలో మంటలు ఎగసిపడ్డాయి. మంటలు అదుపులోకి తెచ్చినా కలప కాలిపోయింది. మొత్తం రూ.9 లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

అనంతపురం క్రైం: పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ భాగ్యలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నగరంలోని 4, 5వ రోడ్లలో కమిషనర్ పర్యటించారు. సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను కంపోస్టు యార్డుకు తరలించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినం

అనంతపురం కల్చరల్: రెండు రోజుల పాటు జరిగే వాసవీమాత ఆత్మార్పణ దినం పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఘనంగా జరిపారు. ఉదయం పూలరథంపై అమ్మవారిని నగర వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో వాసవీ హోమాలు పండితులు సంప్రదాయసిద్ధంగా జరిపించి అమ్మవారి రక్షను భక్తులకు అందించారు. వాసవీ మాల ధరించిన భక్తులు మాట్లాడుతూ ఈనెల 20న పెనుకొండకు వెళ్లి వాసవీమాత దర్శనంతో జిల్లా వాసుల మాలధారణ నియమాలు ముగించనున్నట్లు తెలిపారు.

యువతకు శిక్షణ, ఉద్యోగావకాశాలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఎస్ఎక్స్‌టీ జెన్ బెంగళూరు సహకారంతో నైపుణ్యాల శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు అనంతపురం ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్ స్కిల్స్ కోర్సులకు సంబంధించి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో 60 రోజుల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 77807 52418 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫుట్‌బాల్ కప్ రన్నర్స్‌గా 'అనంత'

అనంతపురం సప్తగిరి సర్కిల్: అండర్-16 ఇన్‌స్పైర్ ఫుట్‌బాల్ కప్ విజేతగా గోవాకు చెందిన కంపాషన్ జట్టు నిలిచింది. రన్నరప్‌ను అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు దక్కించుకుంది. ఆదివారం అనంత క్రీడా గ్రామం వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై 2-1 గోల్స్ తేడాతో గోవా జట్టు విజయం సాధించింది. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను భారత మహిళల అండర్-20 ఫుట్‌బాల్ కోచ్ మైనుల్ రాకీ ప్రదానం చేశారు. ఆర్డీటీ ఫైనాన్స్ డైరెక్టర్ సంజు సంగ్వాన్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఫుట్‌బాల్ కో-ఆర్డినేటర్ దాదాఖలందర్ పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా నిలవాలి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'అభాగ్యులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేసి వారికి అండగా నిలవాలని, తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలను స్కూళ్లలో చేర్పించి అమ్మఒడి వర్తింపజేయాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. ఆదివారం నగరంలోని 45, 47వ డివిజన్లలోని స్థానిక కార్పొరేటర్లు టీవీ చంద్రమోహన్ రెడ్డి, దుర్గాదేవితో కలిసి సునీతానగర్, 5వ రోడ్డు ఎక్స్‌టెన్షన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. అర్హులను గుర్తించి వారికి పథకాలు వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఓ డాక్టర్ దామోదర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది కృష్ణారెడ్డి, అనిల్, సాయితేజ, దిల్షాద్, తదితరులను ఎమ్మెల్యే ఆదేశించారు.

స్పందిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..: ప్రతి నెలా ఒకటోతేదీ ఉదయం 5 గంటలకే పింఛన్ అందిస్తారు.. ఇంకా సమస్యలేమైనా ఉంటే సకాలంలో స్పందిస్తున్నారు.. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనితీరు బాగుందని పోలన్న అనే వ్యక్తి ఎమ్మెల్యేతో అన్నారు. అమ్మ ఒడి వర్తించడంతో తన కొడుకు శంకర్‌ను బాగా చదివించుకుంటున్నామని తెలిపాడు. తన మనువడు లోకేష్‌కు అమ్మ ఒడి వర్తించలేదని భాస్కర్ అనే వ్యక్తి ఎమ్మెల్యేకు తెలిపాడు. ఇంటి నిర్మాణ డబ్బులు పడలేదని వడ్డే బంగారక్క అనే మహిళ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసింది. శీన అనే వ్యక్తికి కాళ్లు, చేతులు చచ్చుబడ్డాయి, సాయం చేయాలని బాధితుడి సోదరి భాగ్య ఎమ్మెల్యే దృష్టికి తెచ్చింది. సునీతానగర్‌లో స్థానికులు కాలువ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. రెండు వీధుల్లో రెండు వైపులా కాలువ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అమినిటీ సాయితేజాను ఎమ్మెల్యే ఆదేశించారు. చదువు మధ్యలో ఆపేసిన వారిని గుర్తించి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చూడాలని ఎమ్మెల్యే తెలిపారు. శారద హైస్కూల్‌ను తనిఖీ చేయాలని కమిషనర్ భాగ్యలక్ష్మిని ఎమ్మెల్యే 'అనంత' ఆదేశించారు. సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయం అందుబాటులో ఉందని, ఈ విషయాన్ని డివిజన్లలో ప్రజలకు తెలియజేయాలని హెల్త్ కార్యదర్శి కవిత, వలంటీర్లు అనిల్, తదితరులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు కృష్ణవేణి, గౌరి, భారతి, రామచంద్ర, సోమశేఖర్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, పెన్నోబులేసు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న మేడా రామలక్ష్మి, అనంత మాలతి తదితరులు

అనంతపురం కల్చరల్: అవోపా (ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) పట్టణ కమిటీ, మహిళా విభాగం సంయుక్తాధ్వర్యంలో స్థానిక రాజు రోడ్డులోని వైశ్యాహాస్టల్ ప్రాంగణంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 60 మంది మహిళలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని, సృజనాత్మకతను చాటుకున్నారు. సీడబ్ల్యూసీ జిల్లా చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, అనంత మాలతి, మహిళావిభాగం గూడూరు అనురాధ, ఇందిర, అవోపా పట్టణ అధ్యక్షుడు జనార్ధన, సెక్రటరీ సత్రసాల మంజునాథ్ తదితరులు సంక్రాంతి పర్వదినాల విశిష్టతను తెలియజేశారు. అనంతరం విజేతలు తన్మయి, శిరీష, స్వప్న, సహనతో పాటు పాల్గొన్న అందరికీ కన్సొలేషన్ బహుమతులు అందించారు.

అనంతలో కళలకు కొదవ లేదు

- డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

అనంతపురం కల్చరల్: అనంతలో కళలకు కొదవలేదని, యువత కూడా సృజనాత్మకత వైపు అడుగులు వేస్తున్నారని డీఎస్పీ ఆర్లశ్రీనివాసులు పేర్కొన్నారు. దర్శకుడు సందీప్ చౌహాన్ దర్శకత్వంలో అనంత వాసులు నిర్మిస్తున్న 'టార్చ్ బేరర్' టీజర్‌ను డీఎస్పీ శ్రీనివాసులు చేతులమీదుగా ఆదివారం ఆవిష్కరింపజేశారు. స్థానిక ఫెడ్‌కాన్ కార్యాలయంలో జీఎంసీ గ్యాలరీ ఫిల్మ్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రం గురించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. కామెడీ, హారర్, యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన వారు కావడంతో ఇక్కడి కళాకారులకు ఎక్కువగా ప్రోత్సాహం ఉస్తుండడం అభినందనీయమని సినీ,టీవీ నటులు రమేష్ నీల్, దర్శకుడు వెంకట్ రామ్ అన్నారు. అనంతరం చిత్ర యూనిట్‌ను డీఎస్పీ శ్రీనివాసులు సన్మానించారు. కార్యక్రమంలో నటీనటులు గౌతమ్, చిట్టాఖగేంద్ర, రామలాలిత్య, షేక్షా, బాషాఖాద్రి, హరీష్, కెమెరామెన్ ప్రదీప్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయిలో రాణించాలి



జననిని అభినందిస్తున్న విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని శాసనమండలి విప్ వెన్నపూస గోపాల్ రెడ్డి తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో గోజురియో కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటి, అంతర్జాతీయస్థాయికి ఎంపికైన జననిని ఆయన అభినందించారు. జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను ఆయన అభినందించారు. జనని థాయ్‌లాండ్‌లోని కౌలాలంపూర్‌లో ఈ ఏడాది మేలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా నుంచి పాల్గొననుంది.

తెగిపడిన విద్యుత్ వైర్లు

ఆత్మకూరు: సిద్దరాంపురం సమీపంలో ఎంఎం హళ్లికి వెళ్లేదారిలో ఆదివారం ఉదయం 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. వైర్లు తెగిన సందర్భంలో దారిలో ఎవరూలేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానిక రైతులు గమనించి విద్యుత్ హెల్పర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే విద్యుత్ సరఫరా బంద్ చేయించారు. ఈవిషయంపై ట్రాన్స్ ఏఈ దాస్ మాట్లాడుతూ విద్యుత్ వైర్లు చాలాకాలంగా ఉండడంతోపాటు, లోడ్ అధికంగా ఉండడం వల్ల తెగిపోయి ఉండొచ్చన్నారు.

ఘనంగా పుష్యార్క హోమం

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం పుష్యార్క హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. వేదపండితులు, అర్చకులు మంత్రోచ్ఛారణల మధ్య హోమాన్ని ముగించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం పట్టి వేత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక ఫెర్రర్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని వన్‌టౌన్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం ఎవరు నిల్వ ఉంచారన్న దానిపై ఆరా తీశారు. కార్డుదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని ఇక్కడి వ్యాపారులు నిల్వ ఉంచినట్లు పోలీసులు గుర్తించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు



విజేతలతో డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలని డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక నగర శివారులోని అఫ్లాటస్ గ్లోబల్ స్కూల్ (ఏజీఎస్)లో నిర్వహించిన 10వ స్పోర్ట్స్ డేకి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తాయన్నారు. ఏజీఎస్ పాఠశాల కరస్పాండెంట్ సాల్మాన్‌రాజ్, పీడీ సుదర్శన్, అలి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శాప్ లీగ్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించారు. ఇటీవల అనంతలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఒకటి గోల్డ్, ఏడు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. సాబర్ విభాగంలో రామకృష్ణ గోల్డ్ మెడల్, ముఫయాజ్, పుష్పరాజ్, కృష్ణ, లోహిత్, సహృత్‌సింహ, త్రివేణి, పుష్పరాజ్‌లు బ్రాంజ్ మెడల్ సాధించారు.

చరణ్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు



అంత్యక్రియల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

రాప్తాడురూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన అనంతపురం రూరల్ మండలం చియ్యేడు సింగిల్ విండో ప్రెసిడెంట్ పూలకుంట శివారెడ్డి కుమారుడు చరణ్‌రెడ్డికి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. బెంగళూరులో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్‌రెడ్డి ఈనెల 5న బెంగళూరు నుంచి సొంతూరుకు ద్విచక్రవాహనంలో వస్తూ బాగేపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన చరణ్‌రెడ్డి బెంగళూరులోని కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. చరణ్‌రెడ్డి మృతదేహాన్ని బెంగళూరు నుంచి పూలకుంటకు ఆదివారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. స్థానికులు, బంధువుల సందర్శనార్థం కొంతసేపు శివారెడ్డి నివాసం వద్ద ఉంచారు. చరణ్‌రెడ్డిని కడసారి చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ బోర్డు మెంబర్ తోపుదుర్తి నయనతారెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, అనంతపురం మేయర్ వసీం తదితరులు చరణ్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. శివారెడ్డి కుటుంబ సభ్యులను నాయకులు ఓదార్చారు. అనంతరం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు చేశారు.

క్రికెట్‌లో టెక్నికల్ అఫీషియల్స్‌దే కీలకపాత్ర

అనంతపురం సప్తగిరి సర్కిల్: క్రికెట్‌లో టెక్నికల్ అఫీషియల్స్‌దే కీలకపాత్ర అని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు తెలిపారు. ఆదివారం అనంత క్రీడా గ్రామంలో జిల్లాలోని అంపైర్లు, స్కోరర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారికి ఒక్కరోజు శిక్షణ తరగతులు జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ నేతృత్వంలో నిర్వహించారు. ఇటీవల ఆర్డీటీ, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన అనంత ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో ఎదురైన సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా క్రికెట్ అంపైర్లు, స్కోరర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జోసెఫ్, అన్సర్‌ఖాన్, అంపైర్లు రవికాంత్, సత్యనారాయణ, వెంకటేష్, మహేష్‌కుమార్, శ్రీధర్, సుధాకర్, రాఘవేంద్ర, సూర్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స.హ. పరిరక్షణ సంఘం నూతన కమిటీ ఎంపిక

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని విద్యుత్ కళావేదిక ప్రాంగణంలో జరిగిన సమావేశంలో సంఘం నూతన గౌరవాధ్యక్షుడిగా షేక్ నబీరసూల్, అధ్యక్షుడిగా హొన్నూరప్ప, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్‌యాదవ్, న్యాయవాది రంగనారాయణ, కార్యవర్గ సభ్యులుగా తోట బాలన్న, భాస్కరనాయుడు, మక్బుల్‌ఖాన్, ఖాసీం, ఎస్ఎం బాషా, రషీద్‌బాషా తదితరులు నూతన కమిటీలో ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం



అప్పటి గురువులను సన్మానిస్తున్న 1989-91బ్యాచ్ విద్యార్థులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కెమిస్ట్రీ విభాగం 1989-91 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి గురువు, ప్రొఫెసర్ బ్రహ్మోజీరావు జ్ఞాపకార్థం రూ.3 లక్షల విరాళంగా ప్రకటించారు. స్నాతకోత్సవంలో ప్రతిభ కనబరిచే కెమిస్ట్రీ విద్యార్థికి బంగారు పతకం అందజేయడానికి ఈ మొత్తాన్ని వినియోగిస్తారు. అప్పటి గురువులు ప్రొఫెసర్ వి. శేషగిరిరావు, ప్రొఫెసర్ వి. కృష్ణారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పి. వెంకటరమణ, ప్రొఫెసర్ కే సుధాకర్ బాబు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలతోనే మనసు ప్రశాంతత



కల్యాణోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక సేవలతోనే మనసు ప్రశాంతంగా ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఆదివారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో తపోవనంలోని శ్రీశివశక్తి బాబా మందిరంలో గోదాదేవి కల్యాణోత్సవం నయనమనోహరంగా జరిగింది. వేదపండితులు వడిగేపల్లి నరసింహాచార్యులు వైష్ణవ సంప్రదాయంలో కల్యాణంలోని అన్ని ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, నెహ్రూ యువకేంద్ర అధికారులు సందీప్‌కుమార్, డీడీవో శ్రీనివాసులు, విజయ్‌సాయి, మణూరు నాగరాజు హాజరై మాట్లాడారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.

రబీ సాగుకు రైతన్న రెడీ



పొలాల్లో వరినాట్లను వేస్తున్న మహిళా కూలీలు



కనగానపల్లి మండలం కుర్లపల్లి వద్ద బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట

కనగానపల్లి/రామగిరి: వైఎస్సార్‌సీపీ అధికారంలో కొచ్చిన తర్వాత అప్పర్ పెన్నార్ (పేరూరు డ్యాం)కు నీరు చేరింది. సకాలంలో భారీ వర్షాలు కురిశాయి. బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగాయి. బీడు భూములు పైర్లవుతున్నాయి. కొన్నేళ్లుగా వర్షాభావంతో పంటలు సాగు చేసుకోలేక ఇబ్బంది పడిన రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు వేరుశనగ పంట సాగు చేశారు. ఏటా రాప్తాడు నియోజకవర్గంలో ఆరు వేల హెక్టార్లలో సాగు చేసేవారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా 12 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెప్తున్నారు. కనగానపల్లి మండలంలోనే 3 వేల హెక్టార్ల దాకా వేరుశనగ సాగయ్యింది. నియోజకవర్గ వ్యాప్తంగా రబీ సీజన్‌లో రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. మొత్తం 1100 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలుస్తోంది. వరి పంటతోపాటు ప్రత్యామ్నాయ, ఉద్యాన పంటలైన రాగి, జొన్న, సజ్జ, చీనీ, మామిడి, జామ, బొప్పాయి, దానిమ్మ పంటల సాగుకు రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు.

వందశాతం ఫలితాలే లక్ష్యం

- రాప్తాడు కేజీబీవీలో ప్రత్యేక బోధన
- గ్రేడ్‌లుగా ఏర్పాటు చేసి తరగతుల నిర్వహణ
- ప్రత్యేక అభ్యసన సామర్థ్యాలు మెరుగునకు ప్రణాళిక
- ఫలితమిస్తున్న వినూత్న ప్రయోగం





తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు, రాప్తాడు కేజీబీవీలో గ్రేడ్-సీ బాలికలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు: కేజీబీవీలో బాలికల బంగారు భవిష్యత్‌కు జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు గట్టి పునాది వేస్తున్నారు. అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక బోధనా ప్రణాళికలను అమలు చేస్తున్నారు. చదువులో ప్రతిభ చూపే వారిని 100 శాతం మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. పూర్తి స్థాయిలో బోధన సిబ్బందిని నియమించిన అధికారులు..చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ఏ,బీ,సీ గ్రేడ్‌లుగా విభజించి, అందరినీ ఏ గ్రేడ్‌కు చేరేలా సన్నద్ధం చేస్తున్నారు. రాప్తాడు కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 265 మంది బాలికలు చదువుతున్నారు. వీరిని గ్రేడ్‌లుగా విభజించారు. కేజీబీవీలో చదివే బాలికలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఇందులో భాగంగా బాలికల బంగారు భవిష్యత్‌కు జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు గట్టి పునాది వేస్తున్నారు.

వినూత్న ప్రయోగం : కేజీబీవీలో 6వ తరగతిలో చేరిన బాలికల అభ్యసన సామర్థ్యాలను ముందుగా గుర్తిస్తారు. ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో రాయడం, చదవడం పూర్తి స్థాయిలో రానివారికి గ్రేడ్ ఇస్తారు. వారికి ప్రాథమిక స్థాయి నుంచి బోధిస్తారు. రోజూ అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేస్తారు. చదువుపై శ్రద్ధ చూపేలా మానసికంగా సిద్ధం చేస్తారు. చదవడం, రాయడం పూర్తి స్థాయిలో వచ్చాక పాఠ్యాంశాలను సులభ పద్ధతిలో అర్థమయ్యేలా బోధిస్తారు. విద్యా సంవత్సరం పూర్తయ్యే సరికి సీ-గ్రేడ్‌లో ఉన్నవారిని ఏ గ్రేడ్‌లోకి వచ్చేలా చక్కని విద్యా ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఆరో తరగతిలో చేరిన బాలిక ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సర్వశిక్ష అధికారులు ముందుకు సాగుతున్నారు.కేజీబీవీలో ప్రభుత్వం నాణ్యమైన రుచికరమైన భోజనం అందిస్తోంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్‌బీకేల్లో రిజిష్టర్ అయిన ఫుడ్ ప్రాసెసింగ్ ఆర్గనైజర్స్‌తో అగ్రిమెంట్ కుదుర్చుకొని తాజా కూరగాయలు సరఫరా చేస్తున్నారు. అలాగే విద్యార్థులకు గుడ్లు, పాలు, పండ్లను ప్రభుత్వం సమకూర్చుతోంది.

బాలికల చదువుపై ప్రత్యేక శ్రద్ధ

కేజీబీవీలోని బాలికలంతా దాదాపు పేద, మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన వారే. వారి విద్యాభ్యసన సామర్థ్యాల కనుగుణంగా బోధన ప్రణాళికలను రూపొందించాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలికల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. చదువు ఆధారంగా బాలికలను గ్రేడ్‌లుగా విభజించి, బోధిస్తున్నాం.

– ముత్యాలమ్మ, ఎస్‌ఓ, కేజీబీవీ, రాప్తాడు

సంత ద్వారా రూ.1.77 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.1,77,050 ఆదాయం సమకూరినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పశువులకు వ్యాపిస్తున్న ముద్ద చర్మవ్యాధి (లంపీస్కిన్ డిసీజెస్) కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ మూడో వారం నుంచి మార్కెట్‌యార్డులో పశువుల సంత బంద్ చేశామన్నారు. కేవలం శనివారం మాత్రమే గొర్రెలు, మేకల క్రయ, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిపారు.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం జరగనుంది. నగర ప్రజలు సమస్యలను స్పందనలో విన్నవించుకోవచ్చు.